7 వరకూ తల్లి పాల వారోత్సవాలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

తల్లిపాలు అమత తుల్యమని వాటి విశిష్టత ను వివరిస్తూ ఏటా ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ వారి చాంబర్ నందు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువుల సరైన అభివృద్ధికి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహ న కల్పించడం వారోత్సవాల ముఖ్య ఉద్దే శ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు

కారుణ్య నియామకాలు ఎప్పుడు?

- నాలుగేళ్లుగా తప్పని ఎదురు చూపులు
- పోస్టుల భర్తీపై పట్టించుకోని అధికారులు
- కాళ్లరిగేలా తిరుగుతున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తి హఠాత్తుగా మరణిస్తే ఆ కుటుంబ సభ్యులు ఆసరా కోల్పోతారు. ఇబ్బందుల్లో కూరుకుపోతారు. అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగం చేయలేకపోయినా అదే పరిస్థితి. ఇలాంటి కుటుంబాలను ఆదుకోవడానికి కారుణ్య నియామకాలను చేపట్టాల్సి ఉంది. అయితే ఇందులో జాప్యం కారణంగా బాధిత కుటుంబాలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తి హఠాత్తుగా మరణించగా ఆసరా కోల్పోయిన కుటుంబ సభ్యులు ఉద్యోగాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నాలుగేళ్ళుగా అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. ఖాళీలు లేవని ఒకసారి, క్వాలిఫికేషన్‌కు తగ్గట్టుగా అవకాశాలు లేవని మరోసారి కుంటి సాకులు చెబుతున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాలేదని, అప్పులు చేసి పోషించుకునే పరిస్థితి ఏర్పడిందని, తమకు ఉపాధి కల్పించాలని జడ్‌పి సిఇఒ, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటూ ప్రమాదవశాత్తు లేదా సాధారణ మరణం చెందితే ఆ కుటుంబం ఒక్కసారిగా దిక్కులేని స్థితికి చేరుతుంది. భార్య పిల్లలు వీధిన పడతారు. ఆర్థిక పరిస్థితి దిగజారి అవస్థలు ఎదుర్కొనే దుస్థితిలోకి నెట్టబడతారు. అప్పటి వరకు ఉన్న పరిస్థితులు తలక్రిందులవుతాయి. అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగం చేయలేని పరిస్థితులు ఎదురౌతుంటాయి. ఇలాంటి కుటుంబాలను ఆదుకోడానికే కారుణ్య నియామకాలను చేపడుతున్నారు.

కోవిడ్ వంటి మహమ్మారి వచ్చినప్పుడు అనేకమంది సాధారణ ప్రజానీకంతోపాటు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. ఇతర సందర్భాల్లోనూ చనిపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడి దీనంగా ఎదురు చూస్తున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో సుమారు 85 మంది మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలు కారుణ్య నియామకాలు చేపట్టాలని నాలుగేళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా జిల్లా పరిషత్ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొన్ని ఖాళీలు భర్తీ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టలేదని, ఇదే విషయంపై అనేకసార్లు జిల్లా పరిషత్ సిఇఒ, ఛైర్మన్‌లకు వినతిపత్రాలు అందించినా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. దీనిపై ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు జిల్లా పరిషత్ సమావేశాల్లో పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం ఇప్పటికే ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. ఉద్యోగి మరణించిన ఏడాదిలోపు అతని కుటుంబ సభ్యులు నియామకం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. మైనర్ పిల్లల విషయంలో ఉద్యోగి మరణించిన రెండు సంవత్సరాలలోపు 18 సంవత్సరాలు వయసు నిండినపుడు మాత్రమే వారి దరఖాస్తు పరిగణించబడుతుంది. వైద్య కారణాల వల్ల రిటైర్మెంట్ కోరుకునేవారి దరఖాస్తు జిల్లా, రాష్ట్ర వైద్యుల కమిటీకి పంపి వారి నివేదిక ఆధారంగా జిల్లా/రాష్ట్ర కమిటీ సిఫార్సు మేరకు నియామకాధికారి అనుమతి ఇస్తారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం...

నా తండ్రి వి.వి.వెంకట సత్యనారాయణ రావు కందికుప్ప మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ 2020 సెప్టెంబరులో చని పోయారు. నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేసాం. మా తరుపున ఎంఎల్‌సి ఐవి కూడా అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

- వనచర్ల సూర్యపవన్ ,అభ్యర్థి, కాట్రేనికోన

ఇంకెంతకాలం చూడాలి..?

నా తండ్రి ఎస్‌విలి.రవిశర్మ గోకవరం మండలం వీరలంకపల్లి మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ 2020 మే 12న మరణించారు. అప్పటి నుంచి ఉద్యోగం కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నాం. ఖాళీలు లేవని బదులిస్తున్నారు. నాలుగేళ్ల గడచిపోయాయి. కొత్త ప్రభుత్వంలో పాలకులు స్పందించి ఇప్పటికైనా మాకు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

స్వర్ణ శ్రీనివాస్, మరణించిన హెచ్‌ఎం కుమారుడు

పూర్తి స్థాయిలో ఖాళీలు లేవు

ప్రస్తుతం జిల్లా పరిషత్తు పరిధిలో అభ్యర్థులకు తగిన పోస్టులు ఖాళీగా లేవు. కేవలం ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు మాత్రమే కొన్ని ఖాళీలున్నాయి. వాటిని వద్దని కొంతమంది చెబుతున్నారు. ఇతర పోస్టులు ఖాళీ అయిన వెంటనే నియామకాలు చేప్పట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

ఎ.శ్రీరామ చంద్రమూర్తి, జడ్‌పి సిఇఒ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా.

దాళ్వా పంట సొమ్ములు రైతులకు చెల్లించాలి

ఎంఎల్‌సి ఐవి

ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-అమలాపురం

గడిచిన దాళ్వా పంటకు సంబంధించిన ధాన్యం సొమ్ము రైతులకు నేటికీ అందకపోవడం దారుణమని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) గురు వారం ఒక ప్రకటనలో అన్నారు. సుమారు రైతులు ధాన్యం అమ్మి రెండు నెలల పైన కావస్తున్నా నేటికీ ప్రభుత్వం దాన్ని డబ్బులు చెల్లించుకోవడం ఎంతవరకు న్యాయమని అన్నారు. గడిచిన జూలై 25న జరిగిన శాసనమండలి సమావేశాల్లో రైతులకు దాళ్వా పంట ధాన్యం సొమ్ములు చెల్లించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు విజ్ఞప్తి చేశారన్నారు. దాళ్వా పంటకు సంబంధించిన ధాన్యం డబ్బులు అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రూ.154 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాకు రూ.424 కోట్లు, కాకినాడ జిల్లాకు రూ.9 కోట్ల వెరసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మొత్తం రూ.587 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందని పౌర సరఫరాల శాఖా మంత్రి ఎన్.మనోహర్‌కు ఎంఎల్‌సిలు ఐవి, లక్ష్మణరావు తెలియజేశారు. రైతులు సార్వా పంటకు సిద్ధమయ్యే తరుణంలో ఈ సొమ్ములు చాలా అవసరమని తక్షణం చెల్లించాలని ఎంఎల్‌సి ఐవి కోరగా 15 రోజుల్లో చెల్లిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. అమలాపురం మండలంలో 435 మంది రైతులకు రూ.5,66,30,469 చెల్లించాల్సి ఉందని ఎంఎల్‌సి ఐవి అన్నారు. మంత్రి హామీ మేరకు రైతులకు బకాయిల సొమ్మును వెంటనే చెల్లించాలని ఎంఎల్‌సి ఐవి డిమాండ్ చేశారు.

జలదిగ్బంధంలోనే అప్పనపల్లి కాజ్ వే

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి కాజువే పై గురువారం కూడా వరద నీరు ప్రవహించింది. మూడు అడుగుల మేర వరద నీటిలో కాజ్వే మునిగి ఉండటంతో ఈ రహదారిలో రాకపోకలు పునరుద్దరణ కు నోచుకోలేదు కాజ్ వే తూరలు శిథిల స్థితికి చేరి దిగబడిపోవడంతో అధికారులు కాలినడక రాకపోకలు నిలిపివేశారు. ద్విచక్ర వాహనాలు ఆటోలు మాత్రమే వేరే మార్గము లో మామిడికుదురు నుంచి ఉచ్చులవారి పేట మీదుగా మూడు లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి వెడల్పు తక్కువగా ఉండడంతో ఫోర్ వీలర్స్ ఎదురు ఏదురుగా తప్పుకోవటానికి అనుకూలంగా లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నారు. వరద ప్రవాహానికి ఒకవైపు మూడు అడుగుల లోతు కోతకు గురికావడంతో ఏ సమయం లో ఏ ముప్పు సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు

ఉచ్చల వారి పేట లో కోతకు గురైన సి సి రహదారి మార్జిన్లు

వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించిన ఎంఎల్ఎ దాట్ల

కాట్రేనికోన: వరద ప్రభావిత గ్రామాల్లో ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు గురువారం పర్యటించారు. మండల పరిధిలోని కొండలేశ్వరం, నడవపల్లి శివారు పల్లిపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజలు యోగక్షేమలు తెలుసుకున్నారు. వరద గ్రామాల్లో ఎటువంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, బి.అంబేద్కర్, గోకరకొండ సత్తిబాబు, పిఎస్‌ఎన్.రాజు, ఎస్‌విఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనాని'కి డొక్కా సీతమ్మ పేరుపై హర్షం

ప్రజాశక్తి-మామిడికుదురు

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరు పెట్టడంపై ఎన్‌డిఎఎ కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామంలో ఉన్న డొక్కా సీతమ్మ నివాసం వద్ద వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, నాయకులు సీతమ్మ నివాసాన్ని సందర్శించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ నిత్యాన్నదానం చేస్తూ చరిత్రకెక్కిన డొక్కా సీతమ్మ ఖ్యాతిని, ఆమె సేవ నిరతిని దేశవ్యాప్తంగా చాటి చెప్పే విధంగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ హయాంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం గర్వించ దగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా సీతమ్మ వారసులు డొక్కా భీమ కామేశ్వరరావు దంపతులను ఎంఎల్ఎ, కూటమి నాయకులు సత్కరించారు. అనంతరం పథకాలకు మహానుభావుల పేర్లు పెట్టిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పిఎం నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు కూటమి నాయకులతో కలిసి ఎంఎల్ఎ గిడ్డి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమం లో పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి, వైస్ ఎంపిపి చెల్లుబోయిన గంగాదేవి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

డొక్కా భీమ కామేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చెయ్యేరు అగ్రహారంలో పింఛను అందజేస్తున్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ గురువారం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు.

రామచంద్రపురం: ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.4 వేలు పెంచిన పింఛన్లను ఉదయం 6 గంటల నుంచి పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణంలోని 6 వ వార్డు లో మంత్రి స్వయంగా వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలోరామచంద్రపురం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. **అంబాజీపేట**: పుల్లేటికుర్రు, ఇరుసుమండ గ్రామాల్లో ఎంపిడిఒ సరోవరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు గురువారం నియోజకవర్గ కో కన్వీనర్లు నామన రాంబాబు, డివివి సత్యనారాయణ, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావులతో కలిసి ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.మమత, సర్పంచులు జల్లి బాలరాజు, అక్కిశెట్టి నాగమణి, బొంతు పెదబాబు, రావణం రాము, అరిగెల సూరిబాబు, చిన్న విజయరావు, మహిపాల తాతాజీ, అక్కిశెట్టి పెద్ద, ఆదిమూలం సూరయ్య కాపు, ఆకుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** జొన్నాడ, ఆలమూరు, గుమ్మిలేరు, సందిపూడి గ్రామాల్లో లబ్ధిదారులకు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, ఈదల నల్ల బాబు, రామానుజుల శేషగిరిరావు, ఈదల వీర్రాజు చౌదరి తదితర నాయకులు పాల్గొన్నారు. **ఆలమూరు** మండలంలోని సంధిపూడికి చెందిన నల్లా పవన్ శ్రీ మణికంఠ పూర్తి వికలాంగుడు. అయితే అతనికి అన్ని అర్హతలు ఉన్నా గత నెలలో పింఛను రూ. 6 వేలు మాత్రమే అందడంతో కూటమి నాయకులు ఈ అంశాన్ని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ బండారు వికలాంగుడు పవన్ అర్హతలు గుర్తించి పూర్తి పింఛన్ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దానితో అధికారులు పవన్ అర్హతలన్నీ పరిశీలించి ఈనెల పూర్తి పింఛను మంజూరు చేశారు. దీంతో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వికలాంగుడు నల్లా పవన్ ఇంటికి వెళ్లి స్వయంగా రూ.15 వేల పింఛన్ అందజేశారు. ఆయన వెంట సర్పంచి తోట భవాని వేంకటేశ్వర్లు, ఎంపీటీసీ తోలేటి సంతోషి, నేతలు దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న, రామానుజుల శేషగిరిరావు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** మండల పరిధిలోని నడవపల్లి, చెయ్యేరు అగ్రహారం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు నిర్వహించారు. ఎంఎల్ఎ దాట్ల వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, సర్పంచ్ చెల్లి సురేష్, రంబాల రమేష్, మండల పార్టీ అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, గొల్ల కోటి దొరబాబు, పి ఎస్ ఎన్ రాజు, విత్తనాల వెంకటరమణ, సలాది నానాజీ,గిడ్డి చంట, కొంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** .భీమనపల్లిలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పూర్తి వికలాంగుడు మందపల్లి వెంకట రామమూర్తికి పెంచిన రూ.15 పింఛను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు మంచెం బుజ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఎంపిటిసి సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు , రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం ఆరో వార్డులో వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న మంత్రి సుభాష్

గుమ్మిలేరులో పింఛన్ అందజేస్తున్న కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో పింఛను అందజేస్తున్న అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు

పుల్లేటికుర్రులో పింఛను పంపిణీ చేస్తున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ దాట్ల తదితరులు

చిన కొత్తలంక మాజీ సర్పంచ్ 'పొత్తూరి' మృతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

చిన కొత్తలంక గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి జిల్లా కార్యదర్శి పొత్తూరి విజయ భాస్కర వర్మ(64) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. చిన కొత్తలంక గ్రామానికి చెందిన వర్మ టిడిపి ఆవిర్భావం చివరి వరకు పార్టీలోనే కొనసాగారు. 1988లో చిన కొత్తలంక గ్రామ సర్పంచ్‌గా, 2001లో సొసైటీ అధ్యక్షునిగా పని చేశారు. టిడిపి గెలుపునకు విజయ భాస్కర వర్మ కృషి చేశారని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. విజయభాస్కర వర్మ మృతదేహాన్ని సందర్శించి ఎంఎల్ఎ సుబ్బరాజు, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, తదితరులు నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మురమళ్ల, ఐ.పోలవరం, గుత్తెనదీవి 11కెవి సబ్ స్టేషన్ మరమ్మతులు నిమిత్తం, ట్రీకట్టింగ్ చేస్తున్నందున మురమళ్ల, కొమరగిరి, పాతఇంజరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, గోగుల్లంక, రామాలయం పేట, కరవాకులంక, మగసాని తిప్ప, కేశనకుర్రు, తిల్లకుప్ప, కేశనకుర్రుపాలెం గ్రామాలకు శు క్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకారవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసినారు.

కార్టూ'నిజం'



విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉద్యోగి తన విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు అన్నారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా కష్ణాజిల్లా మచిలీపట్నం నుంచి బదిలీపై ఉప్పల గుప్తం వచ్చిన తహశీల్దార్ టి.మల్లికార్జునరావు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ విఎస్.దివాకర్ అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. బదిలీ అయిన తహశీల్దార్ మల్లికార్జునరావుకు డిటి దివాకర్, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, రేషన్‌డీలర్లు, రెవెన్యూ సిబ్బంది దుశ్శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, భూ రీ సర్వే డిటి వై.సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఎంవి. రమణ, విఆర్ ఒ, విఆర్ఎల సంఘాల మండల అధ్యక్షులు ఎన్.అహ్మద్ అలీషా, ఉందుర్తి అంజల రావు, విఆర్ ఒలు ఎన్.పల్లంరాజు, ఎ.రాము, ఎన్.భాస్కర బాలాజీ, కె.రమణ, పి. బాలాజీరావు, ఎం. శ్రీరామ్, కె.చంద్రశేఖర్, ఎన్.పుల్లయ్య, జి.వీరవేణి, సూర్య కుమారి,మమత,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన తహశీల్దార్ మల్లికార్జునరావును సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

వర్గీకరణ తీర్పుపై 'ఎంఆర్‌పిఎస్' హర్షం

ప్రజాశక్తి-యంత్రాంగం

సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ ఎస్‌సిల వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు జరుపుకోవచ్చని చారిత్రక తీర్పు ఇవ్వడం పట్ల గురువారం ఎంఆర్‌పిఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

అమలాపురం : ఎస్‌సిల వర్గీకరణ తీర్పుపై అమలాపురంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు సంబరాలు మిన్నంటాయి. బుద్ధ విహార్ సెంటర్లో బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఊరేగింపుగా గడియారపు స్తంభం చేరుకుని ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి, ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు, కోనసీమ మాజీ దండోరా అధ్యక్షుడు గంపల సత్య ప్రసాద్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆకుమర్తి ఆశీర్వాదం మాదిగ, దూరి రాజేష్ మాదిగ, కొల్లి సూర్యారావు మాదిగ, మల్లవరపు సత్తిబాబు మాదిగ, గంపల దుర్గాప్రసాద్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ ఎస్‌సిల వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు జరుపుకోవచ్చని చారిత్రక తీర్పు తీర్పు ఇవ్వడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం అమలాపురం రూరల్ కామనగరువులో జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మడికి శ్రీరాములు ఇంటి వద్ద వారి అధ్యక్షతన విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, తొత్తరమూడి మహేశ్వరరావు, చెట్ల విద్యాసాగర్, ఆకుమర్తి సత్యనారాయణ, సవరపు నాని బాబు, నేదునూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** ఎస్‌సి వర్గీకరణ కు సుముఖత వ్యక్తం చేస్తూ సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం అని ముమ్మిడివరం మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణలో ఎంఆర్‌పిఎస్ మరియు ఎంఎస్‌పి లు సంయుక్తంగా ఖండవిల్లి ఎలియా అధ్యక్షతన గురువారం ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు కార్యక్రమంలో నలమాటి లంకరాజు, ఆకుమర్తి సాయి కృష్ణ, బొమ్మి హరికృష్ణ, లంక శ్రీనివాస రావు, అయినవిల్లి వలియా బాబా తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** మంద కృష్ణ మాదిగ 30 ఏళ్లుగా చేస్తున్న ఉద్యమ ఫలితం సుప్రీంకోర్టు తీర్పుతో నేటికీ నెరవేరిందని ఎంఆర్ పి ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణ పై గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో ఎంఆర్ పి ఎస్ నాయకులు సంబరాలు జరిపారు.ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు పలివెల రాంబాబు, తొత్తరమూడి నరసింహ రావు,చెట్ల విద్యాసాగం తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు :** ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ మామిడి కుదురు సెంటర్లో ఎంఆర్‌పిఎస్ శ్రేణులు వేడుకలు నిర్వహించారు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈదరాడ సర్పంచ్ చుట్టగుల్ల లక్ష్మి,నూటు కుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఎంఆర్‌పిఎస్ నాయకుల సంబరాలు

నేరాలు ఘోరాలు

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి ఆరున్నర కేజీల గంజాయి, 48 గంజాయి రసాయన బాటిళ్లు, 150 స్ట్రిప్పులున్న 4500 టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో రిమాండ్ కు పంపించినట్లు డిఎస్‌పి డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్‌పి వివరాలను వెల్లడించారు. జగన్నాధపురం మామిడిపల్లి వారి వీధికి చెందిన షేక్ ఇస్మాయిల్, షేక్ మౌలాలి, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం గొప్పులపాలెం గ్రామానికి చెందిన జగ్గందొర కొండబాబు బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి కాకినాడ నగరంలో యువతకు విక్రయించి డబ్బు సంపాదిస్తున్నారని అన్నారు. గంజాయి అమ్మకం, కొనుగోలుదారులపై నిఘా పెట్టడంతో కాకినాడ వన్ టౌన్ పరిధిలో కమర్షియల్ రోడ్డులో ఉన్న బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గంజాయి విక్రయదారులు ఉన్నారని వచ్చిన సమాచారంతో దాడి చేసి నిందుతులను అరెస్టు చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాలు ఇచ్చిన బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో ప్రత్యేక కృషి చేసిన ఒన్‌టౌన్ సిఐ వి.సురేష్‌బాబు, క్రైమ్ సిఐ చిట్టిబాలను ఆయన అభినందించారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్లు అంగర ఎస్ ఐ అందే పరదేశి తెలిపారు .ఆయన తెలిపిన వివరాల ప్రకారం కపిలేశ్వరపురం ఏటి గట్టు సమీపంలో దొరలమ్మ చెట్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం భాస్కర్ నగర్ కు చెందిన పాతాల రవితేజ, కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సారిపల్లి మహేష్ బాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ 4,332 విలువచేసే 36 మద్యం సీసాలను ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పరదేశి తెలిపారు .

రెండు లారీలు ఢీ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలం లోని రామవరం జాతీయ రహదారిపై గురువారం రెండు లారీలు ఢీ కొన్ని ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. జగ్గంపేట నుంచి సుద్ద లోడు లారీ రామవరం జంక్షన్ వద్ద యు టర్న్ తీసుకుంటున్న సమయంలో విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న లారీ వచ్చింది. అయితే ఆ లారీ ఢీ కొడుతుందని భావించిన సుద్ద లోడ్ లారీ డ్రైవర్ బ్రేక్ కొట్టాడు. అయినా లారీ ఆగకపోవడం తో కుడి వైపునకు తిప్పాడు. దీంతో జగ్గంపేట నుంచి వస్తున్న లారీనీ ఢీ కొట్టడంతో ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఈ ప్రమాదంలో జగ్గంపేట వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ దేవ సహాయం లారీ లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, హై వే పోలీసులు అతని అతి కష్టం మీద బయటకు తీసి హై వే అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

కోరంగిలో ఘరానా మోసం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల కాలంలో దొంగలు రకరకాల ఎత్తులతో ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి దొంగతనమే ఒకటి తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ సీతారాంపురంలో గురువారం జరిగింది. సీతారామపురంలోని నందిత ఎంటర్ ప్రైజస్‌లో సరుకుల కోసం ఒక కారులో కొంతమంది వ్యక్తులు వచ్చారు. బియ్యం బస్తాలు, వంట నూనె డబ్బాలు వంటివి కారు డిక్కీలో వేసుకున్న తర్వాత ఫోన్‌పే చేసాం చూసుకోండని షాప్ యజమానికి తెలిపారు. ఫోను లాక్ ఓపెన్ చేసి డబ్బులు జమ అయ్యాయో, లేదో చూసుకునే లోపే కారు ఎక్కి దొంగలు ఉడాయించారు. షాపు యజమాని ఓలేటి శారద ఈశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు సిసి ఫుటేజ్‌లు చెక్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇద్దరికి జరిమానా

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరికి రామచంద్రపురం కోర్టు జడ్జి గురువారం రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించి తీర్పు వెలువరించినట్లు అంగర ఎస్ఐ అందే పరదేశి తెలిపారు. గత 2018 జూలై 31న అంగర పిహెచ్‌సిలో నర్సుగా పనిచేస్తున్న పాలింగి విజయలక్ష్మి పై అదే పిహెచ్‌సిలో పనిచేస్తున్న వాచ్ మెన్ గొట్టు వెంకన్న ,అతని భార్య కామేశ్వరి లు విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేష్ కుమార్ కేసు నమోదు చేశారు. గురువారం వీరిని కోర్టులో హాజరుపరచగా వాదోప వాదాలు విన్న అనంతరం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పినట్లు ఎస్ఐ పరదేశి తెలిపారు .

న్యాయం కోసం కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

రాజకీయ పలుకుబడితో స్థానికుడైన దేవగురు ఈశ్వరరావు అనే వ్యక్తి గత 20 ఏళ్లగా ఉన్న సెలూన్ షాపును తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని సెలూన్ షాపు యజమానులు వెదురుపాక సత్యనారాయణ, వినయ్ కుమార్ కలెక్టర్‌ను కోరారు. ధన్వాంతరి నాయిబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి గోపాలకృష్ణ, జిల్లా కోశాధికారి ఉప్పూరి గోపీ కృష్ణలతో కలసి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గోపాలకృష్ణ మాట్లాడుతూ గత 20 ఏళ్లగా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లిస్తూ జీవనోపాధి కోసం ఒక బడ్డీ పెట్టుకుని సెలూన్ షాపు నిర్వహిస్తున్నారన్నారు. సెలూన్ షాపు వెనకాల ఏ విధమైన వాణిజ్య అనుమతులు పొందకుండా వాణిజ్య సముదాయం నిర్మించి తమ షాపును తొలగించాలని ఇబ్బంది పెడుతున్నాడని అన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తమ సామాజికవర్గానికి చెందిన వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పొన్నాడ రమణ, వైస్ ప్రెసిడెంట్ వెదురుపాక సూర్యప్రకాష్‌రావు, సెక్రటరీ వెదురుపాక శివ , జాయింట్ సెక్రటరీ పుల్లేటికుర్తి తాతాజీ ట్రెజరర్ ఏడిద సురేష్ పాల్గొన్నారు.

54 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - సామర్లకోట

కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో డాక్టర్ మాధురి

తమ దృష్టి కంటి ఆసుపత్రి ద్వారా ఇప్పటివరకు 54 మందికి ఉచిత కంటి ఆపరేషన్లతోపాటు, 388 మందికి కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేసినట్లు ఆసుపత్రి నిర్వాహ కులు డాక్టర్ మాధురి మహోన్నత్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. విజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మదర్ థెరిసా స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త భాగస్వామ్యంతో సిఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా తమ ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కరోనా అనంతరం శరీరంలో వస్తున్న మార్పులు ముందుగా గమనించి తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు.

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ దర్శనానికి గురువారం యాత్రికులు పోటెత్తారు. సుమారు 50 వేల మంది యాత్రికులు మరిడమ్మను దర్శించుకున్నారని ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహన్‌రావు తెలిపారు. యాత్రికులు ఇబ్బందులు పడకుండా ఆలయ సిబ్బంది సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు పులిహోర, మంచినీరు సరఫరా చేశారు. సిఐ రవికుమార్, ఎస్ఐ సురేష్‌ల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అన్న క్యాంటీన్ల పనుల ప్రగతి పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని సంత చెరువు వద్ద ప్రతిపాదించిన అన్న క్యాంటీన్ పనుల ప్రగతిని నగర పాలక సంస్థ కమిషనర్ భావన పరిశీలించారు. గురువారం ఆమె క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సంత చెరువు వద్ద నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఇ పి. సత్యకుమారి పనుల ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లను ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో పనులన్నీ 5వ తేదీ కల్లా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇఇ మాధవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

4న వికలాంగుల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - కాజులూరు

ఈ నెల 4న వికలాంగుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సి.నాగేశ్వర శర్మ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు కావలసిన పరికరాలను గుర్తించేందుకు కాకినాడ పాత బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ భవనంలో అలిమ్ కో సంస్థ వారిచే శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 40 శాతం వికలాంగులై ఉండి సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, 2 పాస్‌పోర్టు సైజులో ఫొటోలు, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో ఆదివారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు.

తల్లిపాల వారోత్సవం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ స్థానిక సిహెచ్‌సిలో తల్లులకు తల్లిపాల ఉపయోగంపై అవగాహన కల్పించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం తల్లి పాలు ఇచ్చే తల్లులకు మద్దతు ప్రకటిద్దాం అనే నినాదం తో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి ప్రసవం అయిన గంట లోపే బిడ్డకు పాలు పట్టించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇఒ నిభావని, కనకరత్నం, అంగన్వాడీ వర్కర్లు, సిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో 33/11 కెవి రంగంపేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి రంగంపేట హెడ్ క్వార్టర్ ఫీడర్‌పై చెట్ల కొమ్మలు తొలగించేందుకు నేడు విద్యుత్ సరఫరా ఉండదని విద్యాత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోరుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసే అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోతహశీల్దార్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూ సంబంధ సమస్యలు, మ్యూటేషన్స్ తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై చర్చించారు. మ్యూటేషన్స్ అన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

తలుపులమ్మ దేవస్థానాన్ని సందర్శించిన మంత్రి అనిత

ప్రజాశక్తి - కోటనందూరు

హోంమంత్రికి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న ఆలయ సిబ్బంది

తుని రూరల్ ప్రాంతమైన లోవ కొత్తూరులో తలుపులమ్మ దేవస్థానాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. మంత్రి అనితకు దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు మంత్రికి ప్రసాదాలతోపాటు, తలుపులమ్మ చిత్ర పటాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతోపాటు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కరపలో ప్రజాశక్తి పేపర్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - కరప

క్యాంపెయిన్‌లో ప్రజాసంఘాల నాయకులు

కరప గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాశక్తి పేపర్ క్యాంపెయిన్ నిర్వహించారు. గురువారం కరప గ్రామంలో కౌలు రైతులు జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, ప్రజా సంఘాల నాయకులు యుఎస్ఎన్.రెడ్డి, ఐద్వా నాయకురాలు సిహెచ్.రమణి, బి.రాంప్రసాద్ ప్రజాశక్తి సంవత్సర చందాలు కోసం పలువురు నుంచి సేకరించారు. ప్రజల హక్కుల కోసం పోరాడే ఏకైక పత్రిక ప్రజాశక్తి అని, నియమ నిబంధనలకు కట్టుబడి 44 సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా పేపర్ పెంపుదలకు క్యాంపియన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.35 వేలు విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర ఆలయ నిత్య అన్నధాన ట్రస్ట్‌కు ఇద్దరు దాతలు రూ.35వేలు నగదును విరాళంగా అందజేశారు. గురువారం పెద్దాపురం పట్టణానికి చెందిన చిలుకూరి వెంకటలక్ష్మి రూ.25 వేలు, శ్రీవైట్ల సత్యవతి రూ.10 వేలు చొప్పున నిత్య అన్నదాన ట్రస్ట్‌కు శాశ్వత అన్నదానం నిమిత్తం విరాళాన్ని ఆలయకార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠంకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు తీర్థ ప్రసాదాన్ని అందించారు.

1%హఖు% 4 : దాతలకు రసీదులు అందిస్తున్న అధికారులు

బాధిత కుటుంబానికి అండగా సంఘం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పెంకె వారి పేటలో ఇటీవల విద్యుత్ తీగ తెగిపడి ప్రాణాలు కోల్పోయిన తాళ్ళరేవు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి చిక్కం మురళీకృష్ణ కుటుంబానికి తాళ్ళరేవు భవన నిర్మాణ కార్మికుల సంఘం తరపున ఆర్థిక సాయాన్ని అందించారు. గురువారం సంఘం అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్ బృందం మృతిని కుటుంబ సభ్యులకు రూ.7,500 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పోతుల రాజు, కె.ఈశ్వరరావు, మేడిశెట్టి సత్తిబాబు, అత్తిలి గణేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామానికి చెందిన లంజపల్లి సూర్యారావు భార్య ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందడంతో, భర్త సూర్యరావును, కుమారుడు శ్రీనివాసును సొసైటీ మాజీ అధ్యక్షులు, టిడిపి నాయకులు పరిమి బాబు పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని కోరంగి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి అన్నారు. గురువారం కాలేజీ అఫ్ ఫార్మసీ విద్యార్థుల ఆధ్వర్యంలో పాత కోరంగి గ్రామంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ తప్పక ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిట్టూరి కల్కిమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మున్సిపల్ ఉద్యోగులు, ఆందోళనలో పాల్గొన్న మల్లాడి సత్తిబాబు,

బకాయి వేతనాల కోసం ఆందోళన

ప్రజాశక్తి - యానాం

వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. గురువారం స్థానిక జెండా స్తంభం వద్ద ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మల్లాడి సత్తిబాబు, పుదుచ్చేరి ఆర్ఎల్‌వి జనరల్ సెక్రెటరీ అరదాడి పోసియ్య మాట్లాడుతూ తక్షణమే సిబ్బందికి వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు.

పంట సంరక్షణ, ఎగుమతుల పై శిక్షణ

ప్రజాశక్తి - యానాం

వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యన్ సూచన మేరకు ఆత్మ పథకంలో భాగంగా 25 మంది మహిళలు రైతులకు వరి పంట సంరక్షణ, ఎగుమతులపై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు హైదరాబాదులోని రాజేంద్రనగర్ లో నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ లో మహిళా రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆగష్టు 31 నుంచి సెప్టెంబర్ 5 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. రైతులు వెంట వ్యవసాయ శాఖ ఎఒ జోగిరాజు, ఫీల్డ్ మ్యాన్లు ఖాన్ , విజయ్ ఆత్మ ఏటీఎంలు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట, కరప

మండలంలోని వేట్లపాలెం జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పి.అనురాధ ఆద్వర్యంలో ప్రపంచ స్కౌట్స్ స్కార్ఫ్ దినోత్సవాన్ని నిర్వహించారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **కరప** నడకుదురు జడ్‌పి ఉన్నత పాఠశాలలో వరల్డ్ స్కార్ఫ్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్, స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించడంతోపాటు బిఎస్‌జిలో ప్రవేశం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా భారత స్కాట్ అండ్ గైడ్ ప్రవేశంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు స్కార్ఫ్ అండ్ బ్యాడ్జి బహూకరణ చేశారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో క్లబ్ సభ్యులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎస్.బేగం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవివిఎస్.నారాయణ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యంపై హర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఏలేశ్వరం డిపో నుంచి పెద్దాపురం మండలం మీదుగా కాకినాడకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించడంపై పలు గ్రామాలు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సర్వీసు గురువారం ప్రారంభమైంది. ఈ సర్వీసు ద్వారా పెద్దాపురం, గుడివాడ ,సిరివాడ, కాండ్రకోట, మరలావ ప్రజలు ఏలేశ్వరం వెళ్ళాలన్నా, కాకినాడ వెళ్లాలన్నా సౌకర్యవంతంగా ఉంటుందని, మొదటి సర్వీసుకు ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. కాండ్రకోట గ్రామంలో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు బస్సుకు స్వాగతం పలికారు. అనంతరం బస్సు డ్రైవర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎలిశెట్టి చక్ర ప్రకాష్, బొరుసు రాజు, ఉద్దగిరి రామకృష్ణ పాల్గొన్నారు.

వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి-అమలాపురం

రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను వర్గీకరణ పేరుతో విడగొట్టే ప్రయత్నం చేస్తూ కుట్రలు చేస్తున్న కేంద్రం దానికి అనుగుణంగా నేడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. తక్షణం సుప్రీంకోర్టు అభిప్రాయాలను వెనక్కి తీసుకోవాలని దళితులకు రాజ్యాంగబద్ధమైన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశాయి. గురువారం సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనంలో ఆరుగురు ఎస్‌సిల వర్గీకరణ అవసరమని అభిప్రాయాలు వ్యక్తం చేయడంపై దళిత ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఈదరపల్లి దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు ఇంటి వద్ద దళిత ప్రజా సంఘాల నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబిలోక్ కన్వీనర్ జంగా బాబురావు, కార్యదర్శి ఇసుక పట్ల రఘుబాబు మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం దళితులపై కక్షగట్టి రాజ్యాంగానికి విరుద్ధంగా విడదీసే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు కోట రామ్మోహన్రావు, గెడ్డం సురేష్ బాబు, రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, పాలమూరి మోహన్ బాబు, బొంతు రమణ గూటం సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి నేత నాగేశ్వరరావు పుట్టినరోజు

ప్రజాశక్తి-కాట్రేనికోన

రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, సీనియర్ టిడిపి నాయకులు నాగిడి నాగేశ్వరరావు 62వ పుట్టినరోజు వేడుకలను గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 62 కేజీల భారీ కేకును ఏర్పాటు చేయడంతో ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని కట్ చేయించారు. టిడిపి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొని నాగిడికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, గొల్లకోటి దొరబాబు, చెల్లి అశోక్, ఆకాశం శ్రీనివాస్ , దండుప్రోలు సత్యం, సర్పంచ్లు రంబాల రమేష్, చెల్లి సురేష్, వేలాదిమంది నాగిడి ఫాలోవర్స్, అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -రామచంద్రపురం

నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామచంద్రపురం మండలంలో 33/11 కొత్తూరు సబ్ స్టేషన్‌లో 11 కెవి.కొత్తూరు రూరల్ ఫీడర్ కొత్తూరు టౌన్ ఫీడర్ 11 కెవి. ఎపి టిట్కో ఫీడర్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటిఇంజనీర్ కె విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు గ్రామం, మాలపాడు గ్రామం, అగ్రికల్చర్ సర్వీసెస్ ఎపి టిట్కో కొత్తూరు పైన ఉండే విలేజ్ లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

రూ.10 వేల సాయం అందించిన మంత్రి

ప్రజాశక్తి- రామచంద్రపురం

పట్టణంలోని 2వార్డులో ఫీజులు కట్టలేక చదువు ఆపేసిన బుర్ర విజేతశ్రీకి గురువారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివాసంశెట్టి శుభాష్ రూ.10వేలు సాయం అందజేశారు. అదేవిధంగా ఆపేసిన ఇంటర్ చదువును మళ్లీ చదివిస్తానని మంత్రిహామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

అనారోగ్యంతో బాధపడుతున్న బాలునికి ..

పట్టణం లోని 4వ వార్డు సూర్య నగర్లో నివాసం ఉంటున్నా కొమ్మూరి సుహాస్ అనే బాలుడు అనారోగ్యం (బ్రెయిన్ ఫిట్స్)తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి సుభాష్ స్పందించి బాలుడు తండ్రి కొమ్మూరి శివ, తల్లి ఉమాదేవిలకు తన క్యాంపు కార్యాలయంలో రూ.10 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. అదేవిధంగాప్రతి నెల తన వంతు సాయంగా రూ.6 వేల నగదును బాధితులకు అందచేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. మంత్రికి బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పారదర్శకంగా ఇసుక విక్రయాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-అమలాపురం

పరిశీలిస్తున్న ఉన్నతాధికారుల బృందం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక విధానం- 2024 ద్వారా పారదర్శకంగా ఇసుక విక్రయాలు నిర్వహించాలని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారుల ఆదేశించారు. గురువారం రావులపాడు ఇసుక స్టాక్ యార్డును ఆయన సందర్శించి ఇటీవల ఆన్లైన్ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అందిన ఫిర్యాదులపై ఆయన స్టాక్ యార్డ్ సిబ్బంది లారీ డ్రైవర్ల ద్వారా విచారించారు. స్టాక్ యార్డ్ లో ఇసుక విక్రయాలు ఒక ఆధార్ కార్డు పై గరిష్టంగా 20 మెట్రిక్ టన్నులు ఇసుక సరఫరా ఆన్లైన్ చెల్లింపులు, ఈ పాస్ మిషన్ ద్వారా చెల్లింపులను రోజువారి విక్రయాలు రికార్డులను ఆయన పరిశీలించారు. స్టాక్ యాడ్లో ఎవరైనా ఇసుక సరఫరాకు సంబం ధించి అధికంగా డబ్బులు అడుగు తున్నారా అనే కోణంలో విచారించారు వినియోగదారులను ఇసుక ఏ ఏ భవన నిర్మాణాలకు ఇంటి నిర్మా ణాలకు వినియోగిస్తున్నది వినియోగదారుల ద్వారా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారునికి అందు బాటులో ఉచిత ఇసుక ఉంచాలని పరిపాలన పరమైన ఖర్చులను మాత్రమే వినియోగదారుల నుండి వసూలు చేయాలని సూచించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్ల డుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు స్టాక్ యార్డులు ఉండగా జొన్నాడ స్టాక్ యార్డ్ గోదావరి వరద ముంపు మూలంగా ముంపు బారిన పడిందని తెలి పారు. రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారుల నుండి ప్రభుత్వం వసూలు చేస్తున్నట్లు ప్రజల్లోకి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.. ఇసుక సరఫరా ,నిల్వ, వార్షిక డిమాండ్ యొక్క కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ఉచిత ఇసుక సరఫరా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జెవివి.సత్యనారాయణ, తహశీల్దార్ అశోక్, ఖనిజాభివృద్ధి గనుల శాఖ అధికారి సాయిరాం సింగ్, సహాయ భూగర్భ గనుల శాఖ అధికారి జి.కృష్ణమూర్తి, సిఐ సురేఖ సబ్ అధికారులు తదితరులు పాల్గొన్నా రు.

బాలబాలాజీ నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి-మామిడికుదురు



దాతకు చిత్రపటం అందిసున్న ఆలయ సిబ్బంది

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం అందజేశారు. అమలాపురం వాసులు శ్రీ శిఖా శ్రీనివాసరావు, నాగమణి దంపతుల పుట్టినరోజు ప్రతి ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున అన్నదానం జరిపించు నిమిత్తం రూ.20,116 గురువారం విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమీషనర్ గ్రంధి మాధవి తెలిపారు దాత దంపతులకు ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంలు అందజేశారన్నారు.

గాంధీనగర్‌లో వెలగని వీధి లైట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వెలగని వీధి లైట్లు

మండలంలోని తోటపేట గ్రామపంచాయతీ పరిధిలోని దళితవాడ గాంధీ నగర్ లో నెల రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే గ్రామస్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామం నుండి బయటకు వెళ్లేందుకు చీకట్లో ప్రయాణించవలసి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వీధి కుక్కలు, పాములు సంచరిస్తున్నాయని దీంతో భయం భయంగా ఉంటుందన్నారు. పంచాయతీ అధికారులు దీనిపై స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది దళితవాడలో చెత్త వేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు ఈగలు అధికమయ్యేయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది

నా క్లయింటు **అబ్బిశెట్టి శ్రీను,** S/o. నాగేశ్వరరావు, డో.నెం. 3-81/2, నిడిగొట్ల, వి.టి.సి., కోరుకొండ, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా క్లయింటు యొక్క **ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 3200/1991, Dt. 13-5-1991, SRO, రాజమండ్రి** నెంబర్లు లింకు దస్తావేజు ది. 20-7-2024వ తేదీన నా క్లయింటు ధవళేశ్వరం బజార్ సెంటర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా ధవళేశ్వరం మార్గం మధ్యలో పడిపోయినది. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము.

దాసరి సంజయ్ గుప్తా, అడ్వకేట్
డో.నెం. 9-25-8, గుండువారి వీధి,, మెయిన్‌రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా. సెల్: 93914 73714

పాస్‌పోర్టు పోయినది

సత్తి లోకేశ్వరరెడ్డి అలియాస్ సోమిరెడ్డి, S/o. చంద్రారెడ్డి, డో.నెం. 64-37-12/1, రత్నంపేట, మున్సిపల్ కాలనీ, వి.టి.సి. రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు **B5614988** నెంబరు గల పాస్‌పోర్టును సత్తి సోమిరెడ్డి అను పేరుతో మంజూరు చేసియున్నారు. సదరు పాస్‌పోర్టును జిరాక్స్ నిమిత్తం తీసుకొని వెళ్ళుచుండగా **ది. 03-5-2024వ తేదీన** నా ఇంటి నుండి రాజా థియేటర్ సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కనుక ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

సత్తి లోకేశ్వరరెడ్డి అలియాస్ సోమిరెడ్డి
డో.నెం. 64-37-12/1, రత్నంపేట, మున్సిపల్ కాలనీ వి.టి.సి., రాజమహేంద్రవరం, సెల్: 7386635848

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, పిఠాపురం వారి కోర్టులో

O.S. 41/2023

Between:

షేక్ పాతిమాబీ, W/o. బాజ్జి, ఎ.కె.మల్లవరం గ్రామం, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా.
-పిటీషనర్/ వాది

మరియు

షేక్ బాజ్జి, S/o. షేక్ అబ్బులు సాహెబ్, ఎ.పి.మల్లవరం గ్రామం, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా. -రెస్పాండెంట్/ ప్రతివాది

ఈ నెంబరు రెస్పాండెంట్/ ప్రతివాది అయిన షేక్ బాజ్జి గార్కి ఎన్నిమార్లు శ్రీ కోర్టు వారు నోటీసులు పంపినను తీసుకొనకుండా Avoid చేయుచున్నందున సదరు రెస్పాండెంట్/ ప్రతివాది పై శ్రీ కోర్టు వారి ఎదుట **ది. 02-8-2024వ తేదీన హాజరు కాగలందులకు వాయిదా వేసియున్నారు.** కావున స్వయంగా గాని, వకీలు ద్వారా గాని వచ్చి మీ అభ్యంతరములు తెలుపుకోవలెను. కానిచో సదరు గ్రంథమున పరోక్షమున తీర్మానింపబడును.

పిఠాపురం
తేది: 01-8-2024

మేడిది గణేష్
అడ్వకేట్, తుని